# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 5

సోమవారం, మే 19, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రాష్ట్రంలో పెరిగిన మద్యం ధరలు

హైదరాబాద్: రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగాయి. క్వార్టర్ బాటిల్ మద్యానికి రూ.10.. హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.20, రూ.40 చొప్పున పెంచుతూ తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు డిపోలతోపాటు మద్యం దుకాణాలకు సర్క్యులర్లు జారీ చేసింది. బ్రూవరీల యాజమాన్యాల డిమాండ్ల మేరకు.. ప్రభుత్వం నిపుణుల కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా గత ఫిబ్రవరిలో బీర్ల ధరలను పెంచింది. ఇదే క్రమంలో ఇప్పుడు మద్యం ధరలను పెంచింది.





## సచివాలయాన్ని సందర్శించిన 107 దేశాల పోటీదారులు

**తెలంగాణ తల్లికి పుష్పార్చన.. రాష్ట్ర పథకాలపై డ్రోన్‌షో వీక్షణ**

**అంతకు ముందు కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన**

హైదరాబాద్: రాజధానిలోని హుస్సేన్‌సాగర్ ఎదురుగా రాష్ట్ర పరిపాలన సౌధం.. ఆదివారం సాయంత్రం.. చిరుజల్లులతో కురిసిన వర్షం కాసేపటికి ఆగడంతో ఆహ్లాదకరంగా మారిన వాతావరణం.. ఈ సమయంలో సచివాలయంలో అడుగుపెట్టిన ప్రపంచదేశాల సుందరీమణులు 2 గంటలపాటు సందడి చేశారు. ఫొటోషూట్‌లో 'తెలంగాణ జరూర్ ఆనా' అంటూ నినదించారు. తెలంగాణ తల్లికి పుష్పార్చన చేశారు. తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించిన డ్రోన్‌షోను వీక్షించి అబ్బురపడ్డారు.

**ఘనస్వాగతం పలికి..**

ప్రత్యేక బస్సుల్లో 5.40 గంటలకు సచివాలయానికి చేరుకున్న మిస్‌వరల్డ్ పోటీదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఘనస్వాగతం పలికింది. పర్యాటకశాఖ మంత్రి

- మిగతా 2వ పేజీలో

## రాజ్యాంగమే సర్వోన్నతం

**సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్**



ముంబయి: న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఉద్ఘాటించారు. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరణ చేసే అధికారం ఉన్నా.. అది రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. భారత్ పురోగతి సాధించడమే కాకుండా ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. "న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థ, సుప్రీంకోర్టు, పార్లమెంటు కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనది. మూలస్తంభాలుగా ఉన్న ఈ విభాగాలు రాజ్యాంగం ప్రకారం

- మిగతా 2వ పేజీలో

### గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో వ్యాపారి ఇంట్లో

# ఘోర అగ్నిప్రమాదం

## ఒకే కుటుంబంలోని 17 మంది మృత్యువాత

### మృతుల్లో 8 మంది పిల్లలు, నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులు



హైదరాబాద్: చారిత్రక చార్మినార్ సాక్షిగా హైదరాబాద్ పాతబస్తీలో పెనువిషాదం చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో పొగ వ్యాపించి ఉక్కిరిబిక్కిరై ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన నగరాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. ఒకే అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులున్నారు. అపస్మారకస్థితికి చేరిన నలుగురు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ పెనువిషాదం గురించి తెలిసిన వెంటనే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, డీజీపీ జితేందర్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం రూ.2 లక్షల చొప్పున మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించాయి. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రకటించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాల బంధువులు, స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో ముత్యాల వ్యాపారి ప్రహ్లాద్‌మోదీకి జీ+2 భవనం ఉంది. ఇందులో కింద పోర్షన్‌లో మూడు ముత్యాల దుకాణాలు ఉన్నాయి.

పైరెండు అంతస్తుల్లోని ఎనిమిది గదుల్లో ప్రహ్లాద్‌మోదీ, ఆయన సోదరుడు రాజేంద్రకుమార్ మోదీ కుటుంబాలతోపాటు ప్రహ్లాద్‌మోదీ కుమారుడు పంకజ్‌మోదీ, అతని భార్య, ముగ్గురు పిల్లలు ఉంటున్నారు. వ్యాపార సముదాయం కావడం, ఇల్లు ఇరుకుగా మారడంతో అత్తాపూర్ ఉప్పర్‌పల్లిలో రెండు కుటుంబాలకు రెండు ఇళ్లను నిర్మించి ఆరు నెలల క్రితమే గృహప్రవేశం చేశారు. మరో రెండు నెలల్లో ఇంటీరియర్ పనులు పూర్తిచేసి అక్కడకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. ఇటీవల ప్రహ్లాద్‌మోదీ కాలికి గాయమై నడవలేని స్థితికి చేరారు. కొద్దిరోజుల క్రితమే అత్తాపూర్, రాజీవ్‌నగర్, బంజారాహిల్స్, సనత్‌నగర్‌లలో ఉంటున్న కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లను ఇంటికి రప్పించుకున్నారు. వేసవి సెలవులు కావడంతో అందరూ ఒక చోటికి చేరారు. శనివారం రాత్రి అత్తాపూర్‌లో జరిగిన ఓ వేడుకకు కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో 21 మంది కుటుంబ సభ్యులు గుల్జార్‌హౌజ్‌లోని ఇంటికి చేరారు. ఏసీలు ఆన్‌చేసి నిద్రలోకి జారుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో భవన ప్రవేశమార్గం వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. నెమ్మదిగా పైఅంతస్తుకు విస్తరించడంతో నాలుగు ఏసీల కంప్రెషర్లు ఒక్కసారిగా పేలి మంటలు చెలరేగాయి. కొద్ది సమయంలోనే దట్టమైన పొగ చుట్టుముట్టింది. కిటికీలు, తలుపులు మూసి ఉండటంతో గదులన్నీ పొగతో నిండిపోయాయి. అప్పటికే మేల్కొన్న ఇద్దరు మహిళలు గట్టిగా కేకలు వేస్తూ మిగిలిన వారిని అప్రమత్తం చేశారు. షట్టర్ తెరుచుకొని బయటకు వచ్చి 'బచావ్ బచావ్' అంటూ అరిచారు. ఎదురుగా ఉన్న గాజుల దుకాణం యజమాని ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పొగవస్తున్నట్లు గమనించి పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేశారు. ఈలోగా మరికొందరు

- మిగతా 2వ పేజీలో



# 6 లక్షల ఎకరాలకు సాగునీటి కల్పనే లక్ష్యం


## ఇందిరా సౌర గిరి జల వికాస పథకాన్ని నేడు ప్రారంభించనున్న సీఎం



హైదరాబాద్: రాష్ట్రంలో పోడు భూములను వ్యవసాయ యోగ్యంగా తీర్చిదిద్ది, మెరుగైన ఉత్పాదకత సాధించేలా ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయబోతోంది. తద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇందుకోసం రానున్న ఐదేళ్లలో రూ.12,600 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ పథకాన్ని సోమవారం (ఈ నెల 19న) నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణానికి (2.30 లక్షల మంది ఎస్టీ రైతులకు) పోడుపట్టాలు మంజూరయ్యాయి. ఇందులో విద్యుత్తు సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే.. సమీప రైతులను కలిపి బోర్‌వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాదికి పథకం అమలు కార్యాచరణను గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్) ఖరారు చేసింది. ఈ నెల 25 వరకు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించి, జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన, భూగర్భ జలాల సర్వే తదితర పనుల్ని గిరిజన సంక్షేమశాఖ చేపడుతుంది. జూన్ 25 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు తదితర పనుల్ని పూర్తి చేస్తారు. తొలి ఏడాదికి 10 వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేందుకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చుచేయనున్నారు.

## మద్యం ధరలు పెంచి ఖజానా నింపుకొంటారా?

### ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ ఆగ్రహం




హైదరాబాద్: అడ్డగోలుగా మద్యం ధరలు పెంచి వాటి విక్రయాల ద్వారా ఖజానా నిలుపుకోవాలని చూస్తారా అని ప్రభుత్వంపై భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో తెలంగాణను నంబర్ 1 చేస్తారా? ఇదేనా మీరు చెబుతున్న తెలంగాణ రైజింగ్ అంటే? అంటూ మండిపడ్డారు. మద్యం ధరల పెంపును ఖండిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "పాలన గాలికి వదిలి, సంక్షేమ పథకాలను అటకెక్కించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువగా ఎక్సర్‌సైజ్ చేస్తున్నది ఒక్క ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌పైనే. భారాస ప్రభుత్వం ఉన్నప్పుడు మద్యంపై రాద్ధాంతం చేసిన వాళ్లే.. ఇప్పుడు వాటి ధరలు పెంచి రూ.వేల కోట్ల రాబడిని సమకూర్చుకోవాలనుకోవడం సిగ్గుచేటు. ఇప్పటికే బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం.. ఇప్పుడు ఇతర లిక్కర్ ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోంది. అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుంటే.. ఆ లోటును పూడ్చేందుకు మద్యం ధరలు పెంచడం మీకే చెల్లింది. మద్యం నియంత్రణ విషయంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఒక్క హామీనైనా ఇప్పటివరకు అమలు చేశారా? ఎక్సైజ్ విధానాన్ని పరిశీలించి, సవరించడమంటే.. ధరలను అడ్డగోలుగా పెంచడమేనా? రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేసి భార్యాపిల్లలను రోడ్లపై పడేస్తారా? యువత బతుకులను ఆగం చేస్తారా?" అని హరీశ్ ధ్వజమెత్తారు.

## పీఎస్ఎల్‌వీ-సీ61 విఫలం

**మూడో దశలో సాంకేతిక లోపం**

**వైఫల్యం విచారకరం.. భావి మిషన్లు యథాతథం: ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్**



శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు నమ్మినబంటు, వాణిజ్యపరంగా విదేశీ ఉపగ్రహాలను అవలీలగా రోదసిలోకి మోసుకెళ్లి, కక్ష్యలో ప్రవేశపెట్టి, రూ.కోట్ల రాబడి సమకూర్చిన పీఎస్ఎల్‌వీ.. ఈసారి శాస్త్రవేత్తల నమ్మకాన్ని వమ్ము చేసింది. మూడోదశలో సాంకేతిక లోపంతో ఇది విఫలమైంది. షార్‌లో 22 గంటల కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే ఆదివారం ఉదయం 5.59 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ61 వాహకనౌక మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. తర్వాత 12వ నిమిషంలోనే లోపం తలెత్తింది. రెండు దశల వరకు అంతా బాగానే ఉన్నా, మూడో దశలో రాకెట్ వేగం ఒక్కసారిగా తగ్గుతూ కనిపించింది. వాహకనౌక ఎత్తు ఉండాల్సిన దానికన్నా తక్కువ ఉన్నట్లు గుర్తించారు. మూడోదశ మోటార్ సరిగ్గానే మొదలైనా.. ఆ దశలోనే సమస్య వచ్చిందని, అందువల్ల మిషన్ పూర్తికాలేదని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు. మోటార్ కేసులో ఛాంబర్ ప్రెషర్ తగ్గిపోవడంతో ఈ వైఫల్యం ఎదురైందన్నారు. అనుకున్న లక్ష్యం సాధించలేదని, విశ్లేషణ తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని ఎంసీసీ నుంచి ప్రకటించారు.



## గ్రంథాలయ పిటీఎస్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

హుజూర్ నగర్ మే 18 ( వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాలలో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్స్ ల వేతనాలు పెంచేందుకు కృషి చేయాలని టిఎన్జిఓఎస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని కు పి టి ఎస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ సంస్థను నమ్ముకుని గత 25 సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నామని, ప్రస్తుతం మాకు 6000/ రూ ల వేతనం ఇస్తున్నారన్నారన్నారు. ఇంత తక్కువ వేతనంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారిందని %శ్రీ%వాపోయారు, తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్లకు వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు శాగంటి అయోధ్య పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర అధ్యక్షులు-పిట్ట హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కస్తాల మధు, ఉపాధ్యక్షులు సయ్యద్ సలీం, అంకుష్ కుమార్, కోశాధికారి కంభంపాటి మధుసూదన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో మాజీ కౌన్సిలర్ యరగాని గురవయ్యగౌడ్ మృతి

### గురవయ్యగౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ఉత్తమ్



హుజూర్ నగర్ మే 18 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ యరగాని గురవయ్య గౌడ్ శనివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడిగా, ప్రముఖ లిక్కర్ వ్యాపారి గా సుపరిచితుడైన యరగాని గురవయ్య గౌడ్ సొసైటీ డైరెక్టర్ గా, కౌన్సిలర్ గా రాజకీయ పదవులను చేపట్టి గొప్ప పాలకుడిగా, వ్యాపార వేత్తగా పేరుగాంచాడు. యరగాని గురవయ్య గౌడ్ అకాల మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గౌడ సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, గెల్లి రవి, అట్లూరి హరిబాబు, మాజీ కౌన్సిలర్స్ కొమ్ము శ్రీను, జక్కుల శంభయ్య ఓరుగంటి నాగేశ్వర్ రావు, కోతి సంపత్ రెడ్డి, రాంగోపి, వేముల వరలక్ష్మి నాగరాజు, అమరబోయిన సతీష్ గాయత్రీ భాస్కర్ జక్కుల వీరయ్య గంగరాజు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతగాని లక్ష్మమ్మ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జును రావు, సిపీఎం నాయకులు పల్లా వెంకట రెడ్డి, దుగ్గి బ్రహ్మం, వీరమల్లు, సీపీఐ నాయకులు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, సాముల శివారెడ్డి, వల్లపుదాసు కృష్ణ తండూ ప్రసాద్ ఎరగాని శ్రీనివాస్ సొసైటీ డైరెక్టర్స్, ఘన నివాళులు అర్పించారు. గురవయ్యగౌడ్ కుటుంబాన్నిపరామర్శించిన మంత్రి ఉత్తమ్... బ్రెయిన్ స్ట్రోక్ తో అకాల మృతి చెందిన గురవయ్యగౌడ్ కుటుంబాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరామర్శించి గురవయ్య గౌడ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని , ఆయన కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## సిపిఐ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

### సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్



భీమదేవరపల్లి, మే 18,( వాయిస్ టుడే ప్రతినిధి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ఆదివారం రోజు ముల్కనూరులో భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా రెండో మహాసభల గోడ పత్రికను సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదరి శ్రీనివాస్ ఆవిష్కరించారు ఈనెల 26 27 తేదీలలో హాసన్ పర్తి మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో కమ్యూనిస్టు పార్టీని గ్రామ గ్రామాన విస్తరించి భవిష్యత్తు రాజకీయాలకు ఈ జిల్లా మహాసభలు వేదిక అవుతాయని ఈ మహాసభలలో హనుమకొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎలాంటి ఉద్యమాలు చేయాలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వము దిశా నిర్దేశం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అదరిరమేష్ జిల్లా సమితి సభ్యులు మంచాల రమాదేవి నాయకులు సుంచుకుమారస్వామి,మార్పు సంజీవరెడ్డి, టేకుమట్ల కుమారస్వామి, బోడ బాలరాజు, కవ్వంపల్లి కిషన్, తుమ్మల మమత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుకు వృద్ధురాలు మృతి




భీమదేవరపల్లి, మే 18,( వాయిస్ టుడే ప్రతినిధి ) భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన భూపతి కమలమ్మ వయసు 72 అనే వృద్ధురాలు నిన్న సాయంత్రం 6 గంటలకు తన ఇంట్లో ఉన్న బీరువా లోని బట్టలు తీస్తుండగా బీరువా కింద ఉన్న నాగుపాము మృతురాలి ఎడమ కాలు పై మూడుసార్లు కాటు వేయగా మృతురాలు ఒకసారిగా కేక వేయగా పక్క గదిలో ఉన్న కొడుకు వెళ్లి చూడగానే పాము కాటేసి ఉంటుందని వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం కు తరలించారు. భూపతి కమలమ్మ చికిత్స పొందుతూ రాత్రి 8:30 గంటల సమయంలో మరణించింది.కుమారుడు భూపతి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి బాబు తెలిపారు.

## గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో వ్యాపారి ఇంట్లో

# ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

యువకులతో కలిసి ఆయన సహాయక చర్యలను చేపట్టారు. 11 ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు ప్రమాద ప్రాంతానికి చేరాయి. అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి, నగర కొత్వాల్ సీవీ ఆనంద్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహ్రా ఘటనాస్థలానికి వచ్చారు.






### ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి

చుట్టూ మంటలు, దట్టమైన పొగతో ప్రమాదంలో చిక్కుకున్న 21 మంది ఊపిరాడక విలవిల్లాడారు. బాధితుల్లో ఒకే గదిలో ఉన్న 11 మంది పొగ కారణంగా శ్వాస ఆడక... అపస్మారకస్థితికి చేరుకున్నారు. మిగిలిన గదుల్లో ఉన్న వారు బయటకు వచ్చే ప్రయత్నంలో మెట్ల వద్ద కుప్పకూలిపోయారు. కిటికీలు, తలుపులు మూసి ఉండటంతో తప్పించుకునే అవకాశం లేకపోయింది. స్థానికులు గోడలకు రంధ్రాలు చేసి కొందర్ని బయటకు తీసుకొచ్చారు. ఇంతలో రంగంలోకి దిగిన అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. తీవ్రమైన పొగతో ముందుకెళ్లడం కష్టంగా మారడం, లోపలంతా చీకటిగా ఉండటంతో బాధితులకు గుర్తించేందుకు శ్రమించాల్సి వచ్చింది. ముగ్గురు బాధితులు అక్కడికక్కడే మరణించారు. అపస్మారక స్థితికి చేరిన మిగిలిన వారిని 108 వాహనాల్లో హైదర్‌గూడ, డీఆర్‌డీవో అపోలో, యశోద, ఉస్మానియా, నాంపల్లి కేర్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ప్రహ్లాద్‌మోదీ(73), ఆయన భార్య మున్నీబాయి(70), రాజేంద్రకుమార్‌మోదీ(65), ఆయన భార్య సుమిత్ర(60), ప్రహ్లాద్‌మోదీ కుమారుడు పంకజ్(40), కోడలు వర్ష(38)... వీరి పిల్లలు అనన్యమోదీ(11), ఇదికా మోదీ(8), ఇరాజ్(2), ప్రహ్లాద్‌మోదీ కూతుళ్లు శీతల్‌జైన్(37), రజనీ అగర్వాల్(47), శీతల్‌జైన్ కుమారుడు రిషబ్‌జైన్(13), కుమార్తె ఆరుషి జైన్(17), బంధువుల కుటుంబానికి చెందిన ప్రశాంతి అగర్వాల్(6), అర్షాలి గుప్త(7), అభిషేక్‌మోదీ(40), ప్రథమ్ అగర్వాల్(14) మృత్యువాతపడ్డారు.. టెర్రస్‌పైకి చేరిన నలుగురు ప్రమాదం నుంచి బయటపడ్డారు. వీరిలో ఆశ, గురియా పేర్లు బయటకు వచ్చాయి. మిగిలిన ఇద్దరు ఎవరనేది పోలీసులు ఆరా తీస్తున్నారు.

### పనులుండటంతో వెళ్లి.. ప్రాణాలతో బయటపడ్డారు

సనత్‌నగర్, రహ్మత్‌నగర్: ప్రహ్లాద్ మోదీ పెద్దకుమార్తె రజనీ అగర్వాల్ కుటుంబం సనత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె ముంబయిలో ఉంటున్నారు. కుమారుడు కుశాల్ ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ప్రహ్లాద్‌మోదీ ఆహ్వానంతో కుమారుడితో కలిసి రజనీ పుట్టింటికి వెళ్లారు. అయితే, శనివారం రాత్రి తన తండ్రి రమ్మనడంతో కుశాల్ సనత్‌నగర్‌లోని ఇంటికి తిరిగివచ్చాడు. దాంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఇక ప్రహ్లాద్‌మోదీ రెండో కుమార్తె శీతల్‌జైన్, రాజేశ్‌జైన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. నాలుగు రోజుల క్రితం ఆమె ముగ్గురు పిల్లలతో తండ్రి వద్దకు వచ్చారు. డిగ్రీ చదువుతున్న ఆమె పెద్దకూతురు రిషిజైన్ పరీక్షకు హాజరవ్వాలని శనివారం ఉదయమే రాజీవ్‌నగర్‌లోని సొంతింటికి చేరింది. అగ్ని ప్రమాదంలో ఆమె తల్లి, తమ్ముడు రిషబ్‌జైన్, చెల్లి ఆరుషిజైన్ ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలిసిన వెంటనే తండ్రితో కలసి ఘటనాస్థలానికి చేరుకున్న రిషిజైన్ గుండెలవిసేలా రోదించింది.

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం

అగ్ని ప్రమాద ఘటనపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం, కొండా సురేఖ, శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

### ఈ ప్రమాదాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం-భట్టి

హైదరాబాద్: గుల్జార్‌హౌజ్ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని... రెండు, మూడు రోజుల్లోనే ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు మధిర నుంచి హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి చేరుకున్న ఉపముఖ్యమంత్రి అగ్నిప్రమాదంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహతో కలిసి సమీక్షించారు. అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌తో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఉస్మానియా మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించారు. "ప్రమాదం గురించి తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉస్మానియా ఆసుపత్రికి వచ్చి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూశారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. 17 మంది బాధితులను ఆసుపత్రికి తరలించారు. మొత్తంగా 11 అగ్నిమాపక వాహనాలు, ఒక ఫైర్ ఫైటింగ్ రోబోట్, 17 మంది అగ్నిమాపక అధికారులు, 70 మంది సిబ్బంది మంటల వ్యాప్తిని అడ్డుకున్నారు. మంటలార్పే క్రమంలో ఫైర్ ఫైటర్ ఒకరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు" అని వివరించారు. తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలసి అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని పరిశీలించారు.

## రాజ్యాంగమే సర్వోన్నతం

(మొదటి పేజీ తరువాయి)

కలిసి పని చేయాలి. ఇందులోని అన్ని వ్యవస్థలు సహకారం అందించుకుంటూ పరస్పరం గౌరవించుకోవాలి" అని సీజేఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను గతంలో ఇచ్చిన 50 కీలక తీర్పులతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

### ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం

మహారాష్ట్ర అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తనకు స్వాగతం చెప్పడానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ లేదా ముంబయి పోలీస్ కమిషనర్ రాకపోవడాన్ని తప్పుబట్టారు. మహారాష్ట్రకు చెందిన తాను సీజేఐ హోదాలో తొలిసారి రాష్ట్ర పర్యటనకు వచ్చినా పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని అన్నారు. "నా స్థానంలో ఇంకొకరుంటే రాజ్యాంగంలోని అధికరణం 142ను వినియోగించేవారు" అని సీజేఐ పేర్కొన్నారు. ఈ అధికరణం కింద ఏ వ్యక్తినైనా తమ ముందు హాజరుకమ్మని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వొచ్చు.



## శంకర్ పల్లిలో మిస్టర్ చాయ్ డ్యాడ్ ఫ్రాంచైస్ నీ ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల.. మే 18(వాయిస్ టుడే) శంకర్ పల్లి మున్సిపాలిటీలోని చేవెళ్ల రోడ్డు లో మిస్టర్ ఛాయ్ డ్యాడ్ ఫ్రాంఛైస్ నీ ఆయన ప్రారంభించారు.యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ కాలాన్ని వృధా చేసుకోకుండా ఎవరి అభిరుచి మేరకు వారు,ఎవరి శక్తి సామర్థ్యాల మేరకు, వారు వారికి ఇష్టమైన స్వయం ఉపాధిని చేపట్టి, వారితోపాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు.మిస్టర్ డ్యాడ్ చాయ్ ఫ్రాంఛైస్ నీ స్వయం ఉపాధిగా ఎంచుకున్న శేరి లతా లక్ష్మారెడ్డి,అరుణ సంజీవరెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి చిరకాల మిత్రుడు వారికి చేదోడు వాదోడుగా నిలచిన ఉపాధ్యాయుడు, మరియు సామాజిక కార్యకర్త మర్పల్లి అశోక్ నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్,పట్టణ ప్రముఖులు కాశెట్టి మోహన్,కోడి లింగం, మొగులయ్య,రాము పంతులు, దోభీపేట్ చంద్రయ్య,శకుంతల, శంకర్ పల్లి మండల మాజీ ఎంపీపీలు ధర్మనోళ్ళ గోవర్ధన్ రెడ్డి,చిన్న నరసింహులు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మనోళ్ళ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ భీసోళ్ల శ్రీధర్,మరియు ఏనుగు వినోద్ రెడ్డి,మాల బాలయ్య,మల్లెపూల శంకరయ్య,మాధవరెడ్డి వెంకట్ రెడ్డి, సోమశంకర్,రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



## సచివాలయాన్ని సందర్శించిన 107 దేశాల పోటీదారులు

(మొదటి పేజీ తరువాయి)

జూపల్లి కృష్ణారావు వారిని స్వాగతించారు. సచివాలయ భవనం ఎదురుగా ఏర్పాటుచేసిన వేదికపైకి ఎక్కి అభివాదం చేశారు. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' గేయాన్ని వినిపిస్తుండగా తెలంగాణ తల్లి విగ్రహానికి మిస్ వరల్డ్ ఇండియా నందినిగుప్తా సహా శ్రీలంక, సింగపూర్, మలేసియా, నేపాల్, ఇండోనేసియా, ట్యునీసియా సహా 10 దేశాలకు చెందినవారు పుష్పాంజలి ఘటించారు. సచివాలయం లోపలి ప్రాంగణంలో వారికి రాష్ట్ర ప్రభుత్వం తేనేటి విందును ఏర్పాటుచేసింది. మంత్రి జూపల్లి, హైదరాబాద్ నగర ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు. జూపల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల అభీష్టం మేరకు తమ ప్రభుత్వం పరిపాలన చేస్తోందన్నారు. తెలంగాణలో మీరు సందర్శించిన పర్యాటక ప్రదేశాల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలిసేలా బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రచారం చేయాలని మిస్‌వరల్డ్ పోటీదారులను కోరారు.

పాతబస్తీ గుల్జార్‌హౌజ్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాద మృతులకు మిస్ వరల్డ్ పోటీదారులు, మంత్రులు, అధికారులు సచివాలయంలో మౌనం పాటించి నివాళులర్పించారు. సచివాలయం లోపలి ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక పాలసీ గురించి వారికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏర్పాటుచేసిన డ్రోన్ షోను వీక్షించారు. డ్రోన్లతో సాక్షాత్కారం అయిన తెలంగాణ తల్లి రూపం, తెలంగాణ రైజింగ్ నినాదాన్ని సుందరీమణులు వీక్షిస్తూ అబ్బురపడ్డారు.

### ఆయుధాలు చూసి.. మత్తుకు వ్యతిరేక సందేశమిచ్చి

అంతకుముందు 107 మంది ప్రపంచ సుందరి పోటీదారులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(టీజీఐసీసీసీ)ను సందర్శించారు. ప్రవేశ ద్వారం నుంచే పోలీసుల అశ్వికదళం ఎస్కార్ట్‌తో వారి పర్యటన ప్రారంభమైంది. రెడ్ కార్పెట్‌పై అందాల భామలకు జాగిలాలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆహ్వానం పలికాయి. రాష్ట్రంలో శాంతిభద్రతల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న షీటీమ్స్, భరోసా, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, టీ సేఫ్, టీఎస్ కాప్స్, స్మార్ట్ పోలీసు తదితర విధానాలను అధికారులు వివరించారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేసిన గోడలపై మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పోటీదారులు సంతకాలు చేశారు. ఆయుధాల ప్రదర్శనను తిలకించారు. ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్లతో ఫొటో దిగారు. హైదరాబాద్ సీపీ ఆనంద్, టీజీఐసీసీసీ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి పాల్గొన్నారు.





# కేశవ్‌నగర్‌లో స్వచ్ఛతా కార్యక్రమం

**కార్యక్రమంలో పాల్గొన్న**
**బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఏ. శైలజ**

వాయిస్ టుడే న్యూస్, మే 18 బోడుప్పల్ : బోడుప్పల్ నగర పాలక సంస్థ కేశవ్‌నగర్ కాలనీలో ఆదివారం "స్వచ్ఛ కేశవ్‌నగర్" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కాలనీ కమిటీ అధ్యక్షుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన కాలనీ కమిటీ సభ్యులు సహా కాలనీ నివాసితులు విశేషంగా పాల్గొని చొరవ చూపారు.

ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మునిసిపల్ కమిషనర్ శైలజ మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది. కాలనీ అభివృద్ధి వ్యూహం "కేశవ్‌నగర్ సుస్థిర అభివృద్ధి – భవిష్యత్తు తరాల కోసంలో భాగంగా ఈ కార్యక్రమం ప్రారంభించబడిందని, వీధులను శుభ్రం చేయడం ద్వారా సమాజంలో శుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధికి అవసరమైన మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో ఇటువంటి ప్రజాపాలక కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.



## కేంద్ర ప్రభుత్వం "కులగణన" పూర్తి చేయాలి

**బోడుప్పల్లో 326వ వారం అంబేద్కర్ కు జ్ఞానమాల.**

**పారదర్శకత్వంగా,నిష్పక్షపాతంగా కులగన జరగాలి.**

**జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి.**

**అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య.**

వాయిస్ టుడే న్యూస్, మే 18 బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 326వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహిస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని,యుద్ధ ప్రాతిపదికన కుల గణన ప్రారంభించి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, కులగణన జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని,జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించినప్పుడే అధిక జనాభా గల బడుగు,బలహీన వర్గాలు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందుతారని నత్తి మైసయ్య అన్నారు.అదేవిధంగా కులగనన పూర్తయిన తర్వాత మాత్రమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి నత్తి మైసయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, గరుగుల యాకయ్య, యేసు రాజు, చిల్ల అంజయ్య, సగ్గు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## హన్మంతన్న భరోసా

కుత్బుల్లాపూర్ మే 18(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 4వ డివిజన్ పలు కాలనీ సమస్యల అభివృద్ధి కొరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి తెలియజేసారు. హన్మంతన్న వాటి పరిష్కారం కోసం, కాలనీలోని అభివృద్ధి కోసం పై అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో సమస్యల్ని పరిష్కరించాలని తెలిపారు . అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్ ఎం సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు సురేంద్ర కుమార్ యాదవ్, యుగంధర్ రెడ్డి, వెంకట్రావు, సుబ్బు, శివ కుమార్ యాదవ్, పవన్, నవీన్ మరియు పాల్గొన్నారు.



**చిర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బండారి రాజి రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారికి నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు,నాయకుల దృశ్యం. – ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)**

## అక్రమ బోర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



జూబ్లీహిల్స్ 18 మే (వాయిస్ టుడే): రహేమాత్ నగర్ డివిజన్. ..కార్మిక నగర్ బస్తి ఇంటి నెంబర్ 8-3-228/678/610.... ఎలాంటి అనుమతి లేకుండా రోడ్ పై వేస్తున్న బోర్ ను బుధవారం రోజున ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా 6.5 బోర్ వేస్తున్న ఘటనపై స్థానికులు చేసిన పిర్యాదు పై చర్యలు తీసుకున్నట్లు తహసిల్దార్ నయీమ్ ఉద్దీన్ తెలిపారు..

## అఖిల పక్ష నాయకుల సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– మోటకొండూరు మండలం కేంద్రంలో అన్ని పార్టీ ముఖ్య నాయకులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మోటకొండూరు మండలం అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మూట కొండూరు మండలంలోని కాంగ్రెస్ పార్టీ, బిఆరెస్ పార్టీ, బీజేపి ,టీడీపీ ,సిపిఎం సిపిఐ పార్టీ ల , జేఏసీ నాయకులు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా మోటకొండూరు మండలంలో ప్రభుత్వ కార్యాలయలు నిర్మాణం చేయలనే లక్ష్యం తో ,ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉందో అధికారులు సర్వే చేసి రిపోర్టు అందజేయాలని,దీని ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం చేయడం జరుగుతుందని తద్వారా ప్రజాలకు పాలన సజావుగా కొనసాగుతున్నారు.

## సంగెం గ్రామంలోని ఐ. కె.పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– వలిగొండ మండలం సంగెం గ్రామంలోని ఐ. కె.పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ధాన్యం తేమ శాతం వచ్చిన తరువాత ధాన్యాన్ని కాంట వేసి లోడింగ్ చేసి రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. హమాలీలను ఏర్పాటు చేసి వెంట వెంటనే లారీలలో లోడింగ్ చేయాలన్నారు. రైతులకు ఎక్కడ ఇబ్బంది రానివద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా రైతుల వివరాలు ఎప్పటికపుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ వెంట కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



## సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షులు ఐలరమేష్, ప్రధాన కార్యదర్శిగా మంద శ్రీనివాస్**

**–కోశాధికారి సుంక వేణు, –వైస్ ప్రెసిడెంట్‌గా చొప్పరి సుమన్**

**కందునూరి కుమార్, ఎలగందుల మల్లేశం**

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా మే-18 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యవర్గ ఎన్నికల అధికారిగా ఏ రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు. వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఐల రమేష్, ప్రధాన కార్యదర్శి గా మంద శ్రీనివాస్ గౌడ్, గౌరవ అధ్యక్షులు గా అమిరి శెట్టి రాజలింగం, ఉపాధ్యక్షులుగా చొప్పరి సుమన్, కందునూరి కుమార్ ఎలగందుల మల్లేశం, పల్ల సురేష్,ఎనగందుల ఎల్లయ్య, కోశాధికారి సుంక వేణు, సహాయ కార్యదర్శిగా పల్ల శ్రీనివాస్ ఎలిగేటి రమేష్ కొలిపాక రవీందర్ , ఉల్లంగుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కామని శ్రీకాంత్ ముఖ్య సలహాదారులు ఎం రాజేంద్రప్రసాద్, కొమురవెల్లి భాస్కర్, సుగుణాకర్, లీగల్ అడ్వైజర్ గా కోడెం అజయ్, సర్వోత్తమ్ రెడ్డి, సత్యనారాయణ, కోచ్ గా అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఐల రమేష్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ కోసం వాకర్స్ ను ఎంకరేజ్ చేసి ఆరోగ్యం కొరకు ప్రతి ఒక్కరు వాకింగ్ చేయాలని అన్నారు. ప్రజలందరూ కూడా వాకింగ్ చేసే విధంగా మనందరం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## నిరంతరం కార్మిక, కర్షకుల కోసం పోరాడే పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ

**సీపీఐ మాజీ ఎమ్మెల్సీ చంద్ర శేఖర్ రావు**

కుత్బుల్లాపూర్ మే 18(వాయిస్ టుడే) : బాచుపల్లి మండల మహా సభ పాలబిందెల శ్రీనివాస్ అధ్యక్షన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా సీపీఐ మాజీ ఎమ్మెల్సీ పీ. జే. చంద్ర శేఖర్ హాజరైనారు. మొదలు సీపీఐ జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పేద, కార్మిక, రైతుల కోసం పోరాడే పార్టీ కేలవలం కమ్యూనిస్ట్ పార్టీ అని అన్నారు.భారత దేశ వ్యాప్తంగా కార్మికుడు బతికే పరిస్థితి లేదు అని వారు అన్నారు. ఈ నెల 20 తేదీన జరబోయే దేశ వ్యాప్త సమ్మె పాకిస్థాన్, భారత దేశ మధ్య వున్న పరిస్థితులు వల్ల జులై 9వ తేదీన వాయిదా పడింది అని అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లో పెడింగ్ వున్న మున్సిపల్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలనివారు డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి గా పాలబిందెల శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే బాచుపల్లి మండల కమిటీ 15 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మహా సభలో ఆశీ. యాదయ్య, శ్యామ్, బాలకృష్ణ, దుర్గయ్య, నర్సమ్మ, భాగ్యమ్మ, అమృతమ్మ, పుషమ్మ, యాదమ్మ, కౌశల్య, నాగయ్య, శ్రీనివాస్, రాజు,బ్రాహ్మణంధం, వెంకట్రావు, మహేష్, మోహన్ రెడ్డి, పరమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ బోయిన్పల్లిలో బిజెపి కార్యాలయాన్ని ప్రారంభించిన ఈటెల రాజేందర్



కంటోన్మెంట్: మే 18 (వాయిస్ టుడే ప్రతినిధి): ఓల్డ్ బోయిన్ పల్లి బిజెపి సీనియర్ నాయకులు మరియు ఓల్డ్ బోయిన్పల్లి 119 డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఏనుగుల తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిజెపి డివిజన్ నూతన కార్యాలయాన్ని మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక డివిజన్ నాయకులు ఈటల రాజేందర్ కు ఘన స్వాగతం పలికారు, అనంతరం నూతన కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించరు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్ బోయిన్ పల్లి ప్రజల సమస్యలకు వారధిగా కార్యాలయం లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో బిజెపి అత్యంత పటిష్ఠంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.హైడ్రా పేరిట హస్మత్ పెట్ చెరువు సమీప ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తే వారికి అండగా బిజెపి నిలిచిందని గుర్తు చేశారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పూర్తిగా భ్రష్టు పట్టించిందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం 16 నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసే దిశగా ఈ కార్యాలయం నుండి కార్యాచరణ ప్రారంభం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యాలయం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని స్థానిక నాయకులకు వడ్డేపల్లి రాజేశ్వరరావు,పిలుపునిచ్చారు కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్.మల్లా రెడ్డి , కూకట్ పల్లీ అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు,అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు,జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్,జిల్లా నాయకులు పప్పు పటేల్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గౌడ్,పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు.

## పాతబస్తీ అగ్ని ప్రమాద ఘటన పట్ల మాజీ ఎంపీ నామ దిగ్భ్రాంతి

### ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



ఖమ్మం, మే 18 ( వాయిస్ టుడే) హైదరాబాద్ పాత బస్తీలోని మీర్ చౌక్ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకున్న అగ్నిప్రమాదం దురదృష్టకరమని బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మీడియా కు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనలో 17 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు నామ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అలాగే వారు త్వరగా కోలుకోవాలని నామ ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, క్షతగాత్రులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ధ



## నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్

### పోటు ప్రసాద్ స్మారక స్తూపావిష్కరణ

ఖమ్మం: తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నీడలో పోరాటం సాగించిన పోటు ప్రసాద్ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆదివారం బోనకల్ రోడ్డులోని ఆదిత్య థియేటర్ సమీపంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దివంగత కార్మిక నేత పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని హేమంతరావు ఆవిష్కరించారు. అంతకు ముందు స్థానిక జెడ్పి సెంటర్ నుంచి స్తూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ –సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ పోటు ప్రసాద్ విద్యార్థి దశ నుంచి లౌకిక వామపక్ష భావజాలంతో పని చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాట మార్గమే సరైన మార్గమని నమ్మి తుదిశ్వాస వరకు అదే –పంథాలో పయనించారని హేమంతరావు తెలిపారు. విద్యార్థి నాయకునిగా, కార్మిక నేతగా, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా –రథసారధిగా విభిన్న రూపాల్లో ఆయన పనిచేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ప్రసాద్ తన చివరి కార్యక్రమాన్ని ఖమ్మం కార్పోరేషన్ 40వ డివిజన్లో నిర్వహించారని ఇక్కడి ప్రజలు ప్రసాద్ను నిరంతరం జ్ఞప్తికి –తెచ్చుకునే క్రమంలో స్మారక స్తూపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రజా పోరాటాలు నిర్వహించడమే ప్రసాద్కు –మనమిచ్చే ఘన నివాళి అన్నారు. స్మారక స్తూపం వద్ద సిపిఐ పతాకాన్ని రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి –ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పోటు రాజాసాత్విక్, పగడాల మల్లేష్, స్థానిక నాయకులు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను గడువులోగా పూర్తి చేయండి

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**–సంబంధిత శాఖల అధికారులతో పనుల ప్రగతిని సమీక్షించిన కలెక్టర్**

వరంగల్( వాయిస్ టుడే ) మే 18 : సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద వరంగల్ నగరంలో కొనసాగుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులైన హాస్పిటల్ బ్లాక్లు, యుటిలిటి బ్లాక్, ధర్మశాల, కిచెన్, డైనింగ్, సెక్యూరిటీ, లాండ్రి, ఎక్విప్మెంట్, తదితర పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు.

స్ట్రక్చర్ నిర్మాణ పనులు,స్టాామ్ డ్రైన్ పనులు పూర్తయ్యాయని, మాసోనరీ పనులు 86 శాతం , మెకానికల్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్ పనులు 78 శాతం పూర్తయ్యాయని, అధికారులు కలెక్టర్ కు వివరించగా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పనుల్లో మరింత వేగం పెంచి ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ మెడికల్ విభాగాలను ఏర్పాటు చేయుటకు అవసరగు స్థలం మరియు మెడికల్ పరికరాలు ఎక్కడ అమర్చాలో సంబంధిత మెడికల్ విభాగాల అధిపతులు క్షేత్ర స్థాయిలో భవనంలో పరిశీలించి ఖరారు చేయాలని ఎంజిఎం పర్యవేక్షకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బి ఎస్ఈ నాగేంద్ర, ఎంజీఎం, కేఎంసీ సూపరింటెండెంట్లు కిషోర్, రాంకుమార్ రెడ్డి, టిజిఎంఎస్ ఐడిసి ఈఈ ప్రసాద్, డిఎం హెచ్ ఓ సాంబశివరావు, ఎల్ అండ్ టి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు అర్హులెవ్వరు?

## - ప్రజా వార్షిక ఆదాయానికి సూచి ఎది ?.. ప్రభుత్వ పథకాలకు ఇచ్చేయండి

రాయికల్( వాయిస్ టుడే): వ్యాపారస్తులు,ధనవంతులు ,పన్ను దాతలు ,ప్రభుత్వ రంగాల,ఉద్యోగులు,భూస్వాములు దేశ అభివృద్ధిలో సాధారణ ప్రజల కంటే ఎక్కువగా దేశ అభివృద్ధి కి తోడ్పాటుగా ఉన్నారు. దేశం ప్రపంచ దేశాలతో సమానంగా తలెత్తుకొని ఉన్నది అంటే వీరి పాత్ర అనిర్వచీయమైనది వీరు కొనే ఆస్తులు , వస్తువులతో పాటు ముడి సరుకులు నెల వారి సంవత్సరాల పాటు జి ఎస్టీ మరియు ఆదాయ పన్నులు చెల్లించడం వలన అట్టి ధనం దేశ ఖజానాలో చేరి ప్రభుత్వ పథక లుగా దర్రిద్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు అందుతుంది, కానీ అదే ఉన్నత ధనిక వర్గాలు ప్రభుత్వ పథక ల ద్వార లబ్ది పొందేందుకు పోటీ పడుతున్నారు ,ఇటీవల ఓ రేషన్ షాప్ ముందర చుసిన సంఘటన ఆశ్చర్యకరంగా ఉంది యాభై లక్షల విలువైన కారులో ఉచిత రేషన్ బియ్యం తీసుకుపోతున్నారు సదరు వ్యక్తి దాదాపు ఆస్తుల అంచనా పది కోట్లకు పైగానే ఉంటుంది దాంతో పాటు నెలవారీగా అయిదు లక్షలకు పైగా ఆదాయం వస్తుంది, ఇలా లక్షలాది మంది అనర్హులు ప్రభుత్వ పథకాలను అనుభవిస్తున్నారు

ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామాల్లో 1.5 లక్షలు పట్టణాల్లో 2 లక్షల లోపు ఆదాయం ఉండాలి అంతకు మించి అధికంగా . ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయ పన్ను చెల్లింపు దారులు సొంత కారు ఉన్నవారు 3.5 ఎకరాల మాగాణి 7.5 ఎకరాల కంటే ఎక్కువ మెట్ట భూమి ఉన్నవారు రేషన్ కార్డు కోసం అనర్హులని అధికారులు పేర్కొకుంటున్నారు

**దేశ ఆదాయంతో పాటు ఖర్చు కూడ పెరుగుతుంది**

ఇటీవల పెరిగిన సౌకర్యాలను అంది పుచ్చుకు నేందుకు పెరిగిన ప్రజల ఆదాయంతో పాటు ఖర్చు కూడ పెరుగుతుంది ప్రస్తుతం విద్యా వైద్యం ఉన్నతమైన సౌకర్యాల కోసం ప్రజలు అధికంగా వెచ్చిస్తున్నారు,లక్షలలో




సంపాదించిన ఎగువ మధ్య తరగతి స్థాయికి కూడ సగటు వ్యక్తి పొందే వార్షిక ఆదాయం ఐదు లక్షల లోపు ఉన్న అట్టి సంపాదన సరిపోక అప్పుల పలు అవుతున్న సందర్భాలు అనేకం కనిపిస్తున్నాయి ఇలాంటి సందర్భాలలో మానవ అర్థిక అభివృద్ధి సూచి ని అనుసరించి దేశా వ్యాప్తంగా సర్వే నిర్వహించి పాత చట్టాలను సవరించవలసిన అవసరం ఎంతైనా ఉంది ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి అని ఎగువ మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు

**అభివృద్ధి సూచి ని ఇలా ఎలా గుర్తిస్తారు ?**

ప్రజల అభివృద్ధి ఎలా కొలుస్తారో అర్థం కాదు సిలెండర్ ఉంటే ,ద్విచక్ర వాహనం, ఉంటే ,ఫ్రిజ్ ఉంటే ,స్వంత ఇల్లు ఉంటే అట్టి వ్యక్తులు ఉన్నతంగా బ్రతుకుతున్నట్లు ఎలా భావిస్తారు, ప్రభుత్వ పథకాలు అందడం లేదు బతుకు దెరువుకు కోసం విదేశాలకు పోతే వారిని ధనవంతులుగా గుర్తించి ప్రభుత్వ పథకాల నుండి, పేరును రేషన్ కార్డుల లొంచి వారి పేరును తొలగిస్తున్నారు బ్రతుకు దెరువు కోసమో అవసరం కోసమో కారు కొనుక్కుని ఈ ఎం ఐ లు కట్టే సగటు ప్రజలు కూడ ధనవంతులు గా కనిపించడం అత్యంత దారుణం అదే ఇరువై లక్షల , కోటి రూపాయల ,యాభై లక్షల కారులు ఇతర వాహన లపై తిరిగే వారికి రేషన్ కార్డులు మరియు పథకాలు వర్తించడం ఎంత వరకు సమాన న్యాయంగా ఎలా పరిగణిస్తారో అర్థం కానీ అగమ్య గోచర పరిస్థితి

**మానవత్వంతో ప్రభుత్వ పథకాలు వదిలెయ్యండి**

కోట్లాది రూపాయల ఆస్తుల పాటు కోట్లాది రూపాయల ఆదాయం కలిగి ఉండి ఆర్థికంగా ఉన్నతంగా ఉండి ప్రభుత్వ పథకాలు ,రేషన్ బియ్యం కోసం పాకులాడడం ఎంత వరకు సమంజసం దనవంతు ల్లారా మీరే పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తారు అదే పన్నులతో పథకాలు తయారు అవుతాయి మానవత్వం ఆలోచించండి మీరు ప్రభుత్వ పథకాలు దానికి చిహ్నంగా ఉన్న రేషన్ కార్డును వదిలెయ్య గలగితే ప్రభుత్వాలపై ఆదాయ భారం తగ్గి ఇతర వృద్ది కోసం అట్టి ధనాన్ని వెచ్చి స్తోంది ,అదే పథకాలు కోసం చూస్తున్న అర్హుల అందడం లేదు మీ అధికారం పలుబడితో అవసరం లేకున్నా ప్రభుత్వ పథకలు వస్తున్నాయి కాదా తీసుకుంటున్నాం అనే భావజాలాన్ని వదిలెయ్యండి మీ వంతుగా ప్రభుత్వ పథకాలను ,రేషన్ కార్డు లాంటి సౌకర్యాలను సబ్సిడీలను రద్దు చేసుకుంటే దిక్కు లేని పేదలకు సహాయం అందే అవకాశం ఆస్కారం ఉంది మానవత్వం తో స్పందించండి.

**మీకు అవసరం లేని ప్రభుత్వ పథకలు వదెయ్యండి**

**మన దేశ అభివృద్ధికి తోడ్పడండి**

# విశాల్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు

**ఘనంగా ప్రారంభమైన నాయిని విశాల్ ట్రస్ట్ క్రికెట్ టోర్నమెంట్**

**2030 నాటికి తెలంగాణలో ఒలింపిక్ క్రీడలకు ప్రయత్నాలు: వేం**

**హాజరైన సీఎం సలహాదారు వేం, ప్రభుత్వ విప్,ఎంపీ, ఎమ్మెల్యేలు**

హనుమకొండ, వాయిస్ టుడే: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుమారుడు స్వర్గీయ నాయిని విశాల్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాయిని విశాల్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన NAINI T-10 LEAGUE SEASON% -2 క్రికెట్ పోటీలను హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ స్టేడియం లో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ ల సమక్షంలో వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి నాయిని విశాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నాయిని రాజేందర్ రెడ్డి కుమారుడు 2015 లో దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించడం తో వారి జ్ఞాపకాలను తన మనసులో ఉంచుకుని విశాల్ పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరేలా చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువతకు ప్రోత్సాహాన్ని ఇస్తూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రధానంగా ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా విశ్వవిద్యాలయం స్థాపించిన అన్ని క్రీడలను అభ్యసించేలా చూస్తున్నారని.. గతపాలకుల పాలనలో కుంటుపడిన గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని అన్నారు. దేశంలోనీ గొప్ప క్రీడలన్నింటినీ కూడా ప్రతి వారం, నెలలో ఏదో ఒక క్రీడా జరిగేలా



చూస్తున్నామని అన్నారు. క్రికెట్ తో పాటుగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్ లాంటి అథ్లెటిక్ క్రీడాలను ఏర్పాటు చేసుకుని క్షేత్ర స్థాయిలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు భవిష్యత్ క్రీడలను మరింత అభివృద్ధి చేసేలా ఈ ప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటుంది అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టిలో ఇటీవలే ప్రపంచ సుందరీమణులు పోటీలను ఏ విధంగానైతే ఘనంగా నిర్వహించుకున్నామో 2030 నాటికి ఒలింపిక్ లను కూడా తెలంగాణలో నిర్వహించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. నాయిని విశాల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, కే.ఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ఖమ్మం మే 18 (వాయిస్ టుడే ): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాలుగవ మహాసభలు జూన్ 21,22 తేదీల్లో ఖమ్మంలో జరగనున్నాయని రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు,పని పరిస్థితులు,గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకునే మహాసభలను ఖమ్మం రీజియన్ లోని ఆర్టీసీ కార్మికులందరి సహాయ సహకారాలతో ఎస్ డబ్ల్యూ ఎఫ్ కార్యకర్తలు జయప్రదం చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఖమ్మం లో అయినాల రాంబాబు ప్రాంగణం (మంచికంటి హాల్)లో ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం డిపో 16వ మహాసభల ప్రారంభ సూచికంగా డిపో అధ్యక్షులు పగిళ్ళపల్లి నరసింహారావు అరుణారుణ ఎస్డబ్ల్యుఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు.ప్రతినిధులందరూ పతాకానికి రెడ్ సెల్యూట్ చేశారు.అనంతరం పగిళ్లపల్లి నరసింహారావు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఎస్.రామలక్ష్మి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ప్రతినిధులందరూ నిల్చుని మౌనం పాటించి అమరవీరులకు నివాళులర్పించారు.

మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వి.ఎస్.రావు ప్రారంభోపన్యాసం చేస్తూ ఆర్టీసీ ఖమ్మం రీజియన్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఉద్యమానికి విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు.ఖమ్మం రీజియన్ లో కార్మిక సమస్యల పరిష్కారం కోసం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ స్వతంత్రంగాను,ఎస్డబ్ల్యుఎఫ్ చొరవతో అనేక ఐక్య పోరాటాలు జయప్రదంగా జరిగాయని ఆ పోరాటాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావితం అయ్యాయని పేర్కొన్నారు. ఎస్ డబ్ల్యూ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో మొదటి మహాసభ ఖమ్మం లో జరిగిందని ఆ తర్వాత సుదీర్ఘకాలం తర్వాత 45 సంవత్సరాల అనంతరం ఖమ్మంలో రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగుతున్నాయని అందువలన ఎస్డబ్ల్యుఎఫ్ ఉద్యమానికి బలమైన కేంద్రంగా ఉన్న ఖమ్మంలో



జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అందుకోసం ప్రతి ఎస్ డబ్ల్యూ కార్యకర్త పనిలో నిమగ్నం కావాలని నూతన ఖమ్మం కమిటీ మహాసభలు జయప్రదం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచిస్తూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు

మహాసభలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి ప్రసంగిస్తూ జాతీయంగాను రాష్ట్ర స్థాయిలోనూ పాలకులు అవలంబిస్తున్న విధానాలను కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించాలన్నారు.నూతన ఖమ్మం డిపో కమిటీ మొత్తం ఖమ్మం డిపో కార్మికులందరికీ అందుబాటులో ఉండాలని నీటిలో చేపల్లాగా కార్మిక వర్గంతో మమేకమై పనిచేయాలని సూచిస్తూ,నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

**ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం డిపో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

ఖమ్మం డిపో 16వ మహాసభలో నూతన కమిటీ అధ్యక్షులుగా గడ్డం వెంకటయ్య,కార్యదర్శిగా గుగ్గిళ్ల రోశయ్య, కోశాధికారి గా గడ్డం అయోధ్య,ప్రచార కార్యదర్శిగా చెరుకూరి రామకృష్ణ(ఆర్కె నాయుడు) మహిళా కన్వీనర్ గా డి.సరిత లతో పాటు ఆరుగురు ఉపాధ్యక్షులు ఆరుగురు సహాయకార్యదర్శులు మిగతా 10 మంది కమిటీ సభ్యులతో మొత్తం 27 మందితో నూతన కమిటీ కరతాళ ధ్వనులు, హర్షధ్వానాల మధ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సహాయ కార్యదర్శి హెచ్చు బసవయ్య వందన సమర్పణ తో ముగిసిన ఈ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్,ప్రచార కార్యదర్శి తోకల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు మాధవరావు, నాయకులు డి.సరిత,వి.రమేష్,బుగ్గవీటి లింగమూర్తి, వి.వెంకటేష్, సురేష్,ఎండి గౌస్ పాషా, జి.బాబు, ఏ.శ్రీనివాస్,వీరాచారి ,సీతారామయ్య,మీరా సాహెబ్,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# మున్నూరుకాపులకు పటేల్ గెజిట్ మంజూరు చేయాలి

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అది శ్రీనివాస్‌కు జర్నలిస్టుల వినతి

వేములవాడ, మే 18, (వాయిస్ టుడే): మున్నూరుకాపు సామాజిక వర్గానికి పటేల్ గెజిట్ మంజూరు చేయాలని కోరుతూ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా పటేల్ గెజిట్ మంజూరుతో మున్నూరుకాపుల హక్కులు, పరిరక్షణకు న్యాయస్థానం లభిస్తుందని కొత్త లక్ష్మణ్ పటేల్ పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ పాలనా వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన మున్నూరుకాపుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.మున్నూరుకాపులు చరిత్రలో పటేల్ హెూదాలో గ్రామాల పరిపాలనలో పాలుపంచుకున్నవారైనందున, అధికారిక గుర్తింపుగా పటేల్ గెజిట్ మంజూరు చేయడం సముచితమని తెలిపారు. మున్నూరు కాపులు రైతులుగా దేశానికి అన్నం పెడుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపుల అభ్యున్నతి కోసం ఈ నిర్ణయం అవసరమని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వినతి పత్రాన్ని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పటేల్ గెజిట్ కోసం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారి లో మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పటేల్ , జగిత్యాల్ జిల్లా అధ్యక్షుడు వంగ రమేష్ పటేల్ , మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్, కనకం అమర్ బాబు పటేల్ ,చింతల శ్రీనివాస్ పటేల్ ,కొప్పుల ప్రసాద్ పటేల్,సీనియర్ జర్నలిస్టులు , పటేల్ యూత్ ఫోర్స్ ప్రతినిధులు, మున్నూరు కాపు ప్రతినిధులు పాల్గొన్నారు.




## శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా. హరీష్ బాబు

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, వాయిస్ టుడే -: కాగజ్ నగర్ పట్టణంలోని విజేత హాస్పిటల్ లో ఆలయ ఫౌండేషన్ సహకారంతో శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం శ్రీ మిత్ర సేవా సమితి సభ్యులు, సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు గారిని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమిత్ర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకారి తిరుపతి, సేవా సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్, పెద్ద పెల్లి కిషన్ రావు, సేవా సమితి ఉపాధ్యక్షులు ముంజం బాబురావు, రాకేష్, దేవాజి, ప్రధాన కార్యదర్శి తౌటి ప్రభాకర్, కోశాధికారి సోతుకు బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి మంజుల,మహిళా అధ్యక్షురాలు పోన్న స్రవంతి,సీనియర్ ఉపాధ్యక్షురాలు మంచిల్ల నాగమణి, ప్రచార కార్యదర్శి కస్తూరి అఖిలేష్, సేవా సమితి సభ్యులు వినోద్, రామస్వామి,బొందుల తిరుపతి, శ్రీనివాస్ నరేష్, చిట్యాల పార్వతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు కృషి చేస్తా

### ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే18: హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం కేంద్రస్థాయిలో కృషి చేస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. గతంలో కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని పలుమార్లు కలిశామని, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి కేంద్ర ప్రత్యేక బృందం కూడా వచ్చి సర్వే చేసిందని గుర్తు చేశారు. ఇక్కడి కలెక్టర్ కేంద్రానికి ఓ రిపోర్ట్ కూడా ఇవ్వబోతున్నారని అన్నారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులు ఉన్నారని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభివృద్ధికి వారు రాష్ట్రంలో మిగతా జిల్లాలన్నింటీ కంటే ఎక్కువ నిధులు ఇక్కడికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని వివరించారు.

## జాతీయ అథ్లెటిక్స్‌లో కవి పోలీస్ ప్రసాద్‌కు బంగారు పతకం




భద్రాచలం, మే 18 (వాయిస్ టు డే ) జాతీయ అథ్లెటిక్స్ లో భద్రాచలం కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రసాద్ బంగారు పతకం సాధించారు. భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న ప్రసాద్ జాతీయ స్థాయి లో మెడల్స్ సాధించడం ఎంతో గర్వించ తగిన విషయమని పలువురు అభినందించారు. ప్రసాద్ గతం లో కూడా వివిధ స్థాయిల్లో బహుమతులు గెలుచుకున్నారు. ఒక పక్క వృత్తిని కొనసాగిస్తూనే ఇలా 7th జాతీయ స్థాయి లో ఏడవ అథ్లెటిక్స్ పోటీల్లో విజేత గా నిలవడం విశేషం ! కానిస్టేబుల్ వృత్తి పట్ల నిబద్ధత తో పనిచేసే ప్రసాద్ కి క్రీడా రంగం తో పాటు సాహిత్య రంగం లో కూడా ప్రవేశం ఉంది. సాహిత్య రంగంలో ప్రసాద్ కొన్ని వందల పద్య, గద్య కవితలు రాసి ప్రత్యేక గుర్తింపు పొందారు. సాహిత్య రంగంలో ప్రసాద్ కృషి కి పలు సాహిత్య సంస్థలు అవార్డులతో సత్కరించాయి. కానిస్టేబుల్ ప్రసాద్ కవి ప్రసాద్ గా ప్రాచుర్యం పొందారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన ప్రసాద్ ను భద్రాచలం లోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పోలీస్ అధికారులు, సాహిత్య, క్రీడా కారులు అభినందించారు అభినందించారు.

## మేరు కులదైవ శ్రీ శంకర దాసమయ్య స్వామి ప్రతిష్టాపన ఉత్సవాలు



మల్లాపూర్.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి మే18: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని బోరు సంఘం ఆధ్వర్యంలో శ్రీ శంకర దాసమయ్య సహిత శివ పంచాయతన విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....... ఆలయంలో ప్రతిష్టాపన ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం ఉత్తమ విగ్రహాలు శోభయాత్ర పుణ్యాహ వాసనం రక్త బంధం. అఖండ దీపారాధన 18న నిత్య హెూమం జలధివాసం. 19 యంత్రస్థాపన విగ్రహ ప్రతిష్టాపన కళ్యాణం బోనాలు పూర్ణహుతి మహా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సంఘం అధ్యక్షుడు రామగిరి లింబాద్రి,వెన్నం ప్రభాకర్,గట్ల రవి, మహిళలు,సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## 20 నుండి హనుమజ్జయంతి ఉత్సవాలు

### ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



హుజూర్ నగర్ మే 18 ( వాయిస్ టుడే ప్రతి నిధి) : హుజూర్ నగర్ మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుండి 22 వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించ నున్నారు. ఉత్సవాలు ప్రారంభం నుండి ముగింపు వరకూ జరిగే పూజా ఏర్పాట్లు అన్నదాన కార్యక్రమం, శాంతి కళ్యాణం లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధికమిటి, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వెంకట చలపతి, ఆలయ ప్రధాన అర్చకులు అలహరి నరసింహ చార్యులు, ముడంబై అన్వేష్ కుమార చార్యులు తెలిపారు.

**హనుమజ్జయంతి ఉత్సవాలు.,**

20 న మంగళవారం ఉత్సవ మూర్తికి అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు

21 బుధవారం రోజున అభిషేకం ఆకుపూజ సహస్రనామార్చన పూజలు

22 గురువారం లక్ష నాగవల్లి పూజ శ్రీ ఆంజనేయ స్వామి శాంతికల్యాణం మహా అన్నదానం, ఊర సేవ కార్యక్రమం. గోపాలపురం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ గ్రామానికి చెందిన నియోజక వర్గ ఐఎన్టీయూసి అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య, మెల్లచెరువు ముక్కంటి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## జిల్లా అభివృద్ధికి సహకరించాలి

### శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లాలో విద్యుత్ ఉప కేంద్రాలు, కార్యాలయాల శంకుస్థాపన హై లెవెల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవ శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్క మల్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ డి ఓ సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ. జిల్లాను అభివృద్ధి పదంలో నిలిపేందుకుగాను ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కొత్తగూడెం జిల్లా అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయని జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు గాను పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవలసి ఉన్నదని వాటిని ఉప ముఖ్యమంత్రి కి వివరించారు. జిల్లాలో అటవీ భూమి అధికంగా ఉందని, పర్యాటకంగా అభివృద్ధిపరిచేందుకుగాను జిల్లాలో జూ పార్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఎయిర్పోర్ట్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో పాస్ పోర్ట్ ఆఫీస్, ముర్రేడు వాగు రిటర్నింగ్ వాల్ల నిర్మాణం, కొత్తగూడెంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద క్రీడా మైదానం జిల్లాలో 25 ఎకరాలలో ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఉన్నటువంటి పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని , కేటీపీఎస్ లో ఉన్నటువంటి 24 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులైజేషన్ చేయాలని మిగతా కార్మికులకు ఐడి కార్డులు అందజేయాలని ఆయన కోరారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రజలకు పలు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుందని, వాటితోపాటు జిల్లా అభివృద్ధికి అవసరమైన అన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.



## గుండన్నపల్లి గ్రామ అభివృద్ధి కోసం చొప్పదండి ఎమ్మెల్యే ను కలిసిన నాయకులు

### సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి మే 18: మండలం లోని గుండన్నపల్లి గ్రామ అభివృద్ధి కోసం గ్రామ నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను కరీంనగర్ లోని ఆయన నివాసం లో కలిసి రాజన్న ప్రసాదం అందజేశారు.అనంతరం గుండన్న పల్లి గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేకు విన్నవించారు.తెలిపారు.స్తంభం పల్లి మిల్లు నుండి గుండన్నపల్లి వరకు రోడ్డు నిర్మాణం,గ్రామం లో పలు వీధులలో సి సీ రహదారులు,మున్నూరు కాపు సంఘా భవనం తో పాటు పలు పనుల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పనులు త్వరలో నే ప్రారంభిస్తామని తెలిపారని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మేడుదుల రాజేష్,కొప్పుల నాగేష్,రాదా అంజయ్య,కొప్పుల హనుమండ్లు , సిర్ర పరశురాములు తదితరులు ఉన్నారు.

## కులం కన్నా-గుణం గొప్పది

### మతం కన్నా మానవత్వం గొప్పది అంటున్నా కరీంనగర్ జిల్లా వికలాంగుల అధ్యక్షులు ఓదెల నరేష్



వాయిస్ కూడా ప్రతినిధి బోయినపల్లి మే 18: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన వికలాంగు డు ఓదెల నరేష్ ఆదివారం రోజున తూడి లచ్చన్న వారి సతీమణి రమ పెళ్లిరోజు సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో అర్చన చేయించి ప్రత్యేక పూజలు చేసి తదనంతరం రాజన్న మెట్ల పైన దాదాపు 40 మందికి లచ్చన్న మీద ప్రేమాభిమానంతో ఆదివారం అరటిపండ్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ లచ్చన్న పెళ్లి రోజు సందర్భంగా చాలా సంతోషంగా అనిపిస్తుందని అన్నారు. తూడి లచ్చన్న కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని భగవంతుడు రాజరాజేశ్వర స్వామి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వికలాంగుడు ఓదెల నరేష్ కోరుతున్నాడు



## భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

### ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వాయిస్ టుడే రాజన్న సిరిసిల్ల జిల్లా: అగ్రహారం లోని శ్రీ హనుమాన్ దేవాలయం ఆవరణలో 31 లక్షలతో ప్రాకార గోడ(సాలహారము), ఆర్చి నిర్మాణానికి భూమి పూజ హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం లోని శ్రీ హనుమాన్ దేవాలయం ఆవరణలో 31 లక్షలతో ప్రాకార గోడ(సాలహారము), ఆర్చి నిర్మాణ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆలయ అర్చకులు హాజరై భూమి పూజ చేశారు.




## మాదిగలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం

### రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా

విజయవాడ: ఎప్పుడైనా అన్ని వేళలా మాదిగలకు మేము తోడుగా ఉంటామని మాదిగలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లూరి రాజా అన్నారు. పెద్దా పురం నియోజకవర్గంలో ని సామర్లకోట లో ఎంఆర్పీఎస్ నాయకులు వల్లూరి నాని ఆహ్వానంతో ఓ ప్రవేటు కార్యక్రమంలో రాజా పాల్గొన్నారు. స్థానిక నాయకులు నాయకులు నాని ఆధ్వర్యంలో రాజా కు ఘన స్వాగతం పలికారు.అనంతరం నాయకులు నాని రాజాను ధూస్యావాలుతో సత్కరించారు, ఈ సందర్భంగా రాజా మీడియా తో మాట్లాడుతూ ఎల్లప్పుడూ మేము మాదిగలకు అండగా నిలబడతామని,ప్రభుత్వం నుండి మాదిగలలకు ఎటువంటి అన్యాయం జరుగదని,అన్యాయం జరిగితే సహించేది లేదని, మాదిగలకు అన్ని సంక్షేమ పథకాలు అందేవిధంగా మేము కృషి చేస్తామమని,ఎవరికి అన్యాయం జరుగకుండా ప్రభుత్వాన్ని మేము విజ్ఞప్తి చేశామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాము,ఎం. రాయణరావు,కొప్పుల బాబీ,గంపల సంపూర్ణ రాజు,తదితరులు పాల్గొన్నారు.